సాక్షి వనపర్తి

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



.. పరిరక్షించుకుందాం

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సామాజికవేత్త యోగేందర్ యాదవ్ అన్నారు.

వివరాలు 8లో ▸



రేషన్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లిలో అక్రమంగా దాచిన 114 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.9 /24.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోత తప్పదు. అప్పుడప్పుడు వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు సీపీఎం జిల్లా సదస్సు

పాన్‌గల్: జిల్లాకేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు వేణు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వీరయ్య, జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ హాజరవుతారని.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ వైఖరిపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు.

'దళితుల మద్దతు ప్రధాని మోదీకే..'



వనపర్తిటౌన్: దళితుల మద్దతు బీజేపీకే ఉందని.. మోదీ వెంటే ఉన్నారని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో జరిగిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడగొట్టిన కాంగ్రెస్‌పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా, ఆ పార్టీకి సంబంధించిన నెహ్రూ, ఇందిరాగాంధీకి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు దళితుల ఓట్లు కావాలే తప్పా.. వారి అభ్యున్నతి అవసరం లేదని దుయ్యబట్టారు. దేశంలోని 12 మంది దళితులకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించి, దళిత మహిళని రాష్ట్రపతి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు, జిల్లా అధ్యక్షుడు నారాయణ, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సామేలు, ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, నర్సింహ, శ్రీనివాసులు, విజయ్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణమే లక్ష్యం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తి: తెలంగాణ పునర్నిర్మాణం, అభివృద్ధే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులనుద్దేశించి మాట్లాడారు. 23 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నికలు, రాజకీయాలతో సంబంధం లేకుండా.. ప్రజల ఆకాంక్షల కోసం పోరాడిన పార్టీ బీఆర్‌ఎస్ అని అభివర్ణించారు. కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ రంగాలు అద్భుతమైన ప్రగతి సాధించాయన్నారు. వ్యవసాయరంగంలో 2.50 కోట్ల మందికి ఉపాధి, ఐటీ రంగంలో సుమారు 6 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు చెప్పారు. ఇంటింటికి తాగునీరు, రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్‌లాంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ప్రజలు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు విజయ్, అశోక్, జాత్రునాయక్, గులాం ఖాదర్, జోహెబ్ తదితరులు పాల్గొన్నారు.





నాగర్‌కర్నూల్‌లో కార్నర్ మీటింగ్‌కు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్, చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు నాగం, సింగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

గులాబీ శ్రేణుల్లో జోష్

బీఆర్‌ఎస్‌లో నూతనోత్సాహాన్ని నింపిన మాజీ సీఎం కేసీఆర్ పర్యటన

- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలే..
- కేంద్రం మోటార్లకు మీటర్లు పెట్టమంటే తల తెగిపడినా పెట్టనన్నా
- మళ్లీ నీళ్ల ట్యాంకర్ల కోసం ఎదురుచూసే రోజులొచ్చినయ్
- చదువుకున్న వారు రాజకీయాల్లో ఉంటే అన్ని వర్గాలకు మంచిది
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలి: మాజీ సీఎం కేసీఆర్ పిలుపు

ఒక్క అవకాశం ఇవ్వండి..

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తాను పార్లమెంట్‌కి వెళ్తే రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఈ ప్రాంత ప్రజలు వెళ్లినట్టే.. ఈ ఎన్నికలు కేసీఆర్ ఆశయానికి, రేవంత్‌రెడ్డి అహంకారానికి జరుగుతున్నవి అన్నారు. ఇక్కడి కృష్ణాతీరంలో జన్మించా.. నల్లమలలోని వెంకటేశ్వర్లబావిలో నడక, చదువు నేర్చుకున్న. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. ఈ ప్రాంతాన్ని విద్యారంగంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలుపుతానని పేర్కొన్నారు.

సాక్షి, నాగర్‌కర్నూల్/ నాగర్‌కర్నూల్: గులాబీ బాస్, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రెండురోజుల బస్సుయాత్ర విజయవంతం కావడం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. మొదటిరోజు శుక్రవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బస్సుయాత్ర చేపట్టగా.. రెండోరోజు శనివారం సాయంత్రం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్ నుంచి బస్సుయాత్ర ప్రారంభమైంది. అమిస్తాపూర్, భూత్పూర్, కొత్త మొల్గర, భట్టుపల్లితండా, బిజినేపల్లి మీదుగా నాగర్‌కర్నూల్‌లోని ఉయ్యాలవాడ వరకు చేరుకుంది. అక్కడి నుంచి బస్టాండ్ వరకు భారీ రోడ్‌షో నిర్వహించి.. కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీపై విమర్శలు ఎక్కుపెట్టారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీకి పెద్దఎత్తున తరలివచ్చిన జనాన్ని చూసి వారి ఉద్వేగ స్వాగతానికి ఆనందం కలుగుతోందన్నారు. తాను ఉద్యమ సమయంతో పాటు బీఆర్‌ఎస్ పాలనలోనూ చాలాసార్లు నాగర్‌కర్నూల్‌కు వచ్చానని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి ఒకటిన్నర శాతం ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ హామీలను గాలికొదిలేసిందని, ఈ ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పచ్చని పంటలు, ధాన్యం రాశులతో పాలమూరును బాగు చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.2,500, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, ఆడబిడ్డలకు స్కూటీలు వచ్చాయా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటి నీళ్లిస్తే.. ఇప్పుడు ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సిన స్థితికి తెచ్చారన్నారు. ఐదు ఎకరాలకు మాత్రమే రైతుబంధు ఇస్తామంటున్నారని, 10, 15 ఎకరాల వరకు రైతుబంధు ఇస్తే మీ అయ్య సొత్తు, జాగీర్ ఏమన్న పోతదా అని నిలదీశారు. కాంగ్రెస్‌కు.. ప్రజలకు మధ్య పంచాయితీ నడుస్తుందని, మీ తరఫున కేసీఆర్ పోరాడాలంటే నాకు మీబలమియ్యాలె అన్నారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటితే అడుగు గడప కూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని, చదువుకున్న వ్యక్తి రాజకీయాల్లో ఉంటే అన్నివర్గాలకు మంచి జరుగుతుందన్నారు. మీరు ఎంపీ సీట్లు గెలిపించి ఇస్తే ఈ ముఖ్యమంత్రి మెడలు వంచి హామీలు అమలు చేయిస్తామన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బీజేపీ ఏం చేసిందని ఓటేయాలి..

బీజేపీ అక్కరకు రాని సుట్టమని, మోదీ వంద నినాదాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదని కేసీఆర్ దుయ్యబట్టారు. నాగర్‌కర్నూల్‌కు గుజరాత్ సీఎం వస్తే 1,500 మంది కూడా రాలేదని విమర్శించారు. జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఇవ్వాలని వంద ఉత్తరాలు రాసినా మోదీ స్పందించలేదని, అలాంటి బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా, కొత్త రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల సాయం అడిగితే ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెస్తే నా తల తెగిపడినా పెట్టనని చెప్పానన్నారు. గురుకులాలను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే నాగర్‌కర్నూల్‌ను ప్రపంచ పటంలో పెడతాడన్నారు. రోడ్‌షోలో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలు ధర్మమేనా..

నీ గుడ్లు పీకి గోలీలాడుకుంటా.. నీ పేగులు చీల్చి మెడలో వేసుకుంటా.. నీ చెడ్డి గుంజుకుంటా అంటూ ముఖ్యమంత్రి మాట్లాడటం ధర్మమేనా అని కేసీఆర్ ఆవేదన వెలిబుచ్చారు. తెలంగాణ కోసం తండ్లాడిన వ్యక్తిని ఇన్ని మాటలు అనొచ్చా అని ప్రశ్నించారు. యువకులు ఒక్కసారి ఆలోచించాలని, భవిష్యత్ మీదేనని, ఆలోచించి ఓటు వేస్తే మీ భవిష్యత్ బాగుంటుందన్నారు. ముస్లింలను ఉద్దేశించి కేసీఆర్ కొద్దిసేపు ఉర్దూలో ప్రసంగించారు. బీఆర్‌ఎస్ పాలనలో ముస్లింలకు ఎంత భరోసా కల్పించామో గుర్తు చేసుకోవాలని కోరారు. ఇమాం, మౌజంలకు తనకా ఇచ్చి గౌరవించుకున్నామని చెప్పారు. బాలికల కోసం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూళ్లు తమ కళ్ల ముందే కనిపిస్తున్నాయని వివరించారు. సెక్యులర్ పార్టీగా కొనసాగుతున్న బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

బస్సు యాత్ర సైడ్‌లైట్స్

- సాయంత్రం 7.02 గంటలకు కేసీఆర్ బస్సుయాత్ర నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడకు చేరుకుంది.
- బీఆర్‌ఎస్ శ్రేణులు తమ అధినేతకు ఘనంగా స్వాగతం పలికారు.
- రోడ్‌షోలో కార్లు, బైక్‌ల ర్యాలీ మధ్య 7.52 గంటలకు బస్టాండ్ వద్దకు చేరుకున్నారు.
- 8.07 గంటలకు కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి.. 8.32 గంటలకు ముగించారు.
- కేసీఆర్ స్పీచ్ ప్రారంభిస్తున్న సమయంలో సీఎం.. సీఎం అంటూ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు.



కొత్తమొల్గరలో కేసీఆర్ బస్సుపై పూలు చల్లి స్వాగతం పలుకుతున్న ప్రజలు

రేపు ఓటరు చైతన్య శోభాయాత్ర

అదనపు కలెక్టర్ ఎం.నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎం.నగేష్

వనపర్తి: ఓటు హక్కు వినియోగంపై సోమవారం ఓటరు చైతన్య శోభాయాత్ర పేరిట మెగా అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ ఎం.నగేష్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం సాయంత్రం 5.30 ప్రాంతంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణం నుంచి ఏకకాలంలో మూడు ర్యాలీలు ప్రారంభమై సాయంత్రం 6 వరకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కలిసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది, లబ్ధిదారులు ర్యాలీలో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఒక్కో ర్యాలీలో కనీసం రెండు వేల మంది ఉండాలని, సిబ్బంది, లబ్ధిదారులు వారి వారి సంప్రదాయ వేషధారణతో ర్యాలీలో పాల్గొనాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఓటరూ విధిగా వినియోగించుకోవాలని, అదే సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నదే ర్యాలీ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, సోమవారం ఓటరు చైతన్య శోభాయాత్ర పేరుతో మెగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బందోబస్తు బాధ్యతను డీఎస్పీ వెంకటేశ్వర్లుకు, కనీస సౌకర్యాల కల్పన బాధ్యతను మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. కవులు, కళాకారులు, యువత, స్వచ్ఛంద సంస్థలు ఓటరు చైతన్య శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రామన్‌పాడుకు నిలిచిన నీటి సరఫరా

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి సరఫరా లేదని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. రిజర్వాయర్‌లో శనివారం 1,012 అడుగుల నీటిమట్టం ఉందని.. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు.

ప్రైవేటుకే మొగ్గు!

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అంతంత మాత్రమే..

- కల్లాల్లోనే అధిక ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- కర్ణాటక మార్కెట్‌కు పెద్దఎత్తున తరలుతున్న జిల్లా ధాన్యం

వనపర్తి: యాసంగి వరి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకే విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కంటే ప్రైవేటులో రూ.400 నుంచి రూ.500 వరకు అధికంగా చెల్లిస్తుండటం.. కల్లాల్లోనే ధాన్యం సేకరిస్తుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అంతంత మాత్రంగా సాగుతోంది. జిల్లాలో 242 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 25 రోజులు కావస్తున్నా.. కేవలం 8,466 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, పెబ్బేరు మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలుచేసి, కర్ణాటక మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా కేంద్రమైన వనపర్తి, గోపాల్‌పేట, పెద్దమందడి, రేవల్లి, కొత్తకోట మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ధాన్యం కొనుగోలుకు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ పరిమితమైనట్లు తెలుస్తోంది. జిల్లాలో పండించిన ధాన్యంలో అగ్రభాగం ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు.



అమరచింత శివారులో ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

రూ. 2 కోట్ల చెల్లింపులు మాత్రమే..

జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు సుమారు రూ. 17 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ. 2 కోట్ల మేర చెల్లింపులు మాత్రమే చేశారు. ఇంకా రూ. 15 కోట్ల వరకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

టార్గెట్‌లో 20 శాతం దాటడం కష్టమే..

యాసంగిలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ధాన్యం సేకరణ మాత్రం మందకొడిగా సాగుతోంది. ప్రైవేటు వ్యాపారులు అధిక ధర చెల్లిస్తుండటం. రవాణా ఖర్చు లేకపోవడం.. ధాన్యం తూకంవేసిన రోజునే డబ్బులు చేతికందుతుండటంతో రైతులు ప్రైవేటుకే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే.. 15 నుంచి 30 రోజుల వరకు డబ్బుల కోసం వేచి చూడక తప్పదు. ఈకారణంగా టార్గెట్‌లో కనీసం 20 శాతం అంటే 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించే పరిస్థితి కనిపించడం లేదు.

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాకు రూ. 500 ప్రోత్సాహకాన్ని అమలుచేసి ఉంటే.. ప్రైవేటు వ్యాపారులకు పెద్ద మొత్తంలో ధాన్యం విక్రయించే పరిస్థితులు వచ్చి ఉండేవి కాదని అన్నదాతలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చర్చించుకుంటున్నారు.

ట్రక్ షీట్లు వచ్చిన వెంటనే చెల్లింపులు

కొనుగోలు కేంద్రాల నుంచి డాక్యుమెంట్లు (ట్రక్‌షీట్లు) వచ్చిన వెంటనే చెల్లింపులు చేస్తున్నాం. కర్ణాటక మార్కెట్‌కు వెళ్లే ధాన్యం సన్నాలు మాత్రమే. దొడ్డురకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే వస్తుంది. చెల్లింపుల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తాం.

– బాలు, అసిస్టెంట్ డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

నారాయణపేట అడిషనల్ కలెక్టర్ మియాంక్ మిత్తల్

అమరచింత/ఆత్మకూర్: గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం సరికాదని నారాయణపేట అడిషనల్ కలెక్టర్ మియాంక్ మిత్తల్ అన్నారు. శనివారం అమరచింత, ఆత్మకూర్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి వసతులపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. వయో వృద్ధులతో పాటు మహిళలకు అవసరమైన వసతులు కల్పించాలని, తాగునీరు, వెలుగురు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. వీల్ చైర్లతో పాటు బూత్‌ల వద్ద ర్యాంప్‌లు ఉన్నాయా లేవా అన్న విషయాలను తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు గుర్తించి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలు గుర్తించి ఎలాంటి వసతులు కల్పించాలి, ఎంత మందితో బందోబస్తు నిర్వహించాలన్న విషయాలను ముందస్తుగా తెలియజేయాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్లు చాంద్‌పాషా, రాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, పుర కమిషనర్లు నురుల్ నదీం, నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లోని ఓ పోలింగ్ బూత్‌లో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

ఇంటింటికీ ఓటరు స్లిప్‌లు అందాలి..

ప్రభుత్వపరంగా ఓటరు స్లిప్‌లు ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ మియాంక్ మిత్తల్ తెలిపారు. అమరచింతలో శనివారం బీఎల్వోలు బూత్‌ల వారీగా చేపడుతున్న ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రచ్చకట్ట వద్ద కూర్చొని అందరిని ఒకే చోటకు పిలిచి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయొద్దని, ఓటరు ఇంటికే వెళ్లి నేరుగా స్లిప్‌లు అందించాలని సూచించారు. ఇంటి అడ్రస్ సరిగా చూసి బాధ్యతగా అప్పగించాలన్నారు.

పకడ్బందీగా వర్టికల్స్ అమలు చేయాలి



సమీక్ష సమావేశంలో ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: జిల్లాలో ఫంక్షనల్ వర్టికల్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వర్టికల్ ఇన్‌చార్జ్‌లతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్‌శాఖ అమలు చేస్తున్న 14 వర్టికల్స్ గురించి సమీక్షించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కల్పించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్యపాత్ర పోషిస్తారని, బాధితులతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కేసుల ఛేదనలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలన్నారు. సీసీ కెమెరాల అవశ్యకతను ప్రజలకు వివరించి ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేసుకునేలా చూడాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఎఫ్‌ఆర్‌ఐ నమోదు చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలకేంద్రాలు, గ్రామాల్లో పర్యటిస్తూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, గ్రామాల్లో తిరిగే కొత్త వ్యక్తులపై ఆరా తీయాలని ఆదేశించారు. డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, వర్టికల్ ఇన్‌చార్జ్, డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐలు నాగభూషణం, రాంబాబు, రవిపాల్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను నమ్మొద్దు

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: కేంద్రం, రాష్ట్రంలో పదేళ్ల అధికారం అనుభవించి అహంకార పాలన చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. శనివారం రెండోరోజు ఆయన జిల్లా కేంద్రంలోని బాలానగర్, ఇందిరాకాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లిల్లూ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి డా. మల్లు రవిని గెలిపించాలని కోరుతూ.. కరపత్రాలు పంపిణీ చేసి హస్తం గుర్తుకు ఓటువేయాలని కోరారు. పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేయలేని రుణమాఫీని ఆగస్టులోగా చేసి చూపిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

రెండో రోజు కేసీఆర్ బస్సుయాత్ర


నాగర్‌కర్నూల్ కార్నర్ మీటింగ్ విక్టరీ సింబల్ చూపుతున్న కేసీఆర్


బస్సుయాత్రకు బయలుదేరే ముందు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అయిన కేసీఆర్


ఏవీఆర్ కాలనీ వద్ద భట్టుపల్లి తండావాసులకు అభివాదం చేస్తున్న కేసీఆర్


కేసీఆర్ బస్సులో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గర్భస్థ శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

గద్వాల క్రైం: గర్భంలోనే శిశువు మృతి చెందిందని.. ఇందుకు వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబం కథనం మేరకు.. ధరూరు మండలం ర్యాలంపాడుకు చెందిన గీత గర్భం దాల్చడంతో మొదటి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించుకుంటుంది. నెలలు నిండటంతో ఈ నెల 23న ఆస్పత్రికిరాగా పరీక్షించిన వైద్యురాలు శుక్రవారం ప్రసవానికి రావాలని సూచించింది. శుక్రవారం రాగా పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని.. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లాలని తెలిపింది. దీంతో వారు పట్టణంలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో శిశువు మృతి చెందిందని గుర్తించి కుటుంబ సభ్యుల అనుమతితో శస్త్రచికిత్స చేసి బయటకు తీశారు. దీంతో బాధిత కుటుంబం మొదట చూయించుకున్న ఆస్పత్రికి వెళ్లి వైద్యురాలి నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందంటూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని నచ్చజెప్పి పంపించారు. ఈ ఘటనపై వైద్యురాలిని సంప్రదించగా అమె అందుబాటులోకి రాలేదు. పట్టణ పోలీసులను వివరణ కోరగా తమకేలాంటి ఫిర్యాదు అందలేదని.. ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

యాచకురాలు..

కోస్గి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వృద్ధురాలు శనివారం మృతిచెందింది. సుమారు 60 ఏళ్ల వయసున్న ఈమె కొంతకాలంగా బస్టాండ్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. శనివారం బస్టాండ్‌లోని బైక్‌లు నిలిపే స్థలంలో ఎండలో పడి ఉండటం చూసి ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు తెలుపడంతో వారు వచ్చి చూసి మృతి చెందినట్లు గుర్తించి పుర పారిశుద్ధ్య సిబ్బందితో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాల కోసం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రైలు పట్టాలు దాటుతుండగా వృద్ధుడు..

మహబూబ్‌నగర్ క్రైం: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ మహ్మద్ అక్బర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని తిమ్మసానిపల్లికి చెందిన ఉండడి ఎల్లయ్య (85) శనివారం ఉదయం కాటన్‌మిల్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వచ్చిన రైలు ఆయనను ఢీకొనడంతో తల, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా వైద్యుడు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

అడ్డాకుల: అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన రాజేష్ (35)కు అడ్డాకుల మండలం బలీదుపల్లికి చెందిన గోవిందమ్మతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. రెండేళ్లుగా గోవిందమ్మ భర్తకు దూరంగా ఉంటుండగా.. ఆమెను తీసుకెళ్లడానికి శుక్రవారం రాజేష్ బలీదుపల్లికి వచ్చాడు. అర్ధరాత్రి తర్వాత పక్కనే ఉన్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేష్ తండ్రి శనివారం ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాతూరుబైలు వద్ద ఎలుగుబంటి సంచారం



మన్ననూర్: నల్లమల అభయారణ్యం శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి పాతూరుబైలు సమీపంలో రోడ్డు దాటుతూ ఓ ఎలుగుబంటి ప్రయాణికులకు కనిపించింది. అయితే గత 15 రోజుల క్రితం పిల్ల ఎలుగుబంటిని పోగొట్టుకున్న తల్లి ఎలుగుబంటి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో ఆవేశంగా ఉన్న ఎలుగుబంటి ఎవరైన కనిపిస్తే దాడి చేసే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో అటవీ పరిసర ప్రాంతంలో సంచరించే సమయంలో పశువులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

- యూపీ, రాజస్థాన్‌లో బీజేపీకి గడ్డుకాలమే
- ప్రొఫెసర్, సామాజికవేత్త యోగేందర్ యాదవ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యోగేందర్ యాదవ్

స్టేషన్ మహబూబ్‌నగర్: సార్వత్రిక ఎన్నికలు సాధారణమైనవి కావని.. రాజ్యాంగాన్ని రక్షించే ఎన్నికలు అని ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్, సామాజిక వేత్త యోగేందర్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో శనివారం రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, నిరుద్యోగం, రైతుల గురించి ఎవరూ మాట్లాడటం లేదన్నారు. ఏం అభివృద్ధి చేశారో చెప్పి ఎన్నికల్లోకి రావాల్సి ఉండగా.. మోదీని చూపెట్టి ఎన్నికల్లోకి వస్తున్నారని అన్నారు. హిందూ, ముస్లింలు ఈ దేశ సంతానమేనని, వీరి మధ్య మధ్య గొడవలు, మత విద్వేషాలు రచ్చగొట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు ఇండియా కూటమి, బీజేపీకి మధ్య కావన్నారు. ప్రజలకు, బీజేపీ మధ్య జరుగుతున్న ఎన్నికలు అని అన్నారు. తాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఐదు రోజులు పర్యటించానని, అక్కడ బీజేపీ తిరోగమనంలో వెళ్తుందని తెలిపారు. రాజస్థాన్‌లో సగం సీట్లు రాని పరిస్థితి బీజేపీకి ఉందన్నారు. తెలంగాణలో ఎలాగైతే నియంత పాలనకు చరమగీతం పాడారో.. ఇప్పుడు నియంత పాలనను పారద్రోలడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

- ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ గతంలో లాగా ఒకరిని ఒకరు ప్రేమించే సంస్కృతి ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. రాజ్యాంగం సమానత్వాన్ని కల్పించిందని.. దేశంలో కులవ్యవస్థ పోవాలని కాంక్షించారు.
- ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ పదేళ్ల కాలంలో 160 మిలియనర్లు దేశంలో ప్రతి ఏడాది వస్తున్న ఆదాయంలో పావలవంతు అనుభవిస్తుండగా.. 40 శాతం సంపద వాళ్ల చేతుల్లోనే ఉందన్నారు. కింది స్థాయిలో 50 శాతం ఉన్న ప్రజలకు 6.5 శాతం దక్కుతుందన్నారు. ఆస్తుల్లో 15 శాతమే అనుభవిస్తున్నారని, ఈ పదేళ్లలో దేశంలో వచ్చిన వ్యత్యాసమని అన్నారు దేశంలోని ఎన్నో సమస్యలపై ఈ రోజు ప్రజలు ప్రశ్నిస్తూ, సంఘటితమవుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే సమానంగా బతకడానికి, ఎదగడానికి వచ్చే అవకాశాలు తగ్గిపోతాయన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రొఫెసర్ చింతకింద కాశీం, బామ్‌సే ప్రతినిధి దాసురాంనాయక్, ఐపీ ఆశీర్వాదం, బిషప్ విల్సన్, హనీఫ్ అహ్మద్, మౌలానా సాబేర్ ప్రసంగించారు. సభలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ వన్నాడ అంజన్న, ఎస్ఎం.ఖలీల్, కాచం సత్యనారాయణ గుప్తా, రవినాయక్, పాస్టర్లు వరప్రసాద్, సుందర్‌పాల్ ఉన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం


అభివాదం చేస్తున్న భరత్‌ప్రసాద్ తదితరులు

కొల్లాపూర్: మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. శనివారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి భరత్‌ప్రసాద్ హాజరై మాట్లాడారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కేంద్రం అన్ని రకాల సహకారం అందిస్తోందన్నారు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు వివాహ బానిసత్వం నుంచి విముక్తి కల్పించారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాల్లో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే మహిళల అభివృద్ధికి ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తానని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, మహిళా నాయకురాళ్లు కీర్తిరెడ్డి, మాలతి, రోజారమణి, నాయకులు అశోక్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రమేష్, సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

దేశ రక్షణ కోసం బీజేపీని గెలిపించాలి


బీజేపీలో చేరిన వారితో రాష్ట్ర నాయకురాలు రుద్రమదేవి తదితరులు

కొత్తకోట రూరల్: దేశాన్ని కాపాడుకునేందుకు బీజేపీని గెలిపించాలని, బీజేపీతోనే అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని పార్టీ రాష్ట్ర నాయకురాలు రాణి రుద్రమదేవి అన్నారు. మండలంలోని పాలెంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్‌కుమార్‌తోపాటు 150 మందికి పైగా కార్యకర్తలు శుక్రవారం రాత్రి బీజేపీలో చేరారు. వారికి రాణిరుద్రమాదేవి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ గడిచిన పదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేసి గద్దె నెక్కారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఒరిగేది ఏమి లేదని, బీజేపీకి ఓటు వేస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని కావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలని, ఇందుకోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, కొండ ప్రశాంత్‌రెడ్డి, భరత్‌భూషణ్, కోటేశ్వర్‌రెడ్డి, కుర్వ రమేష్, అయ్యగారి విష్ణువర్ధన్‌రెడ్డి, పబ్బ నరేందర్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకు అవకాశాలు

- ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

అచ్చంపేట రూరల్: పార్టీ బలోపేతానికి కష్టపడే ప్రతి కార్యకర్తకు అవకాశాలు వస్తాయని, కార్పొరేషన్ పదవి వస్తుందనుకున్న నాకు పార్టీ గుర్తించి ఎమ్మెల్సీ ఇచ్చిందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో పార్లమెంట్ సన్నాహక ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చాలా మంది కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే పదవులు రావంటారని, కష్టపడితే మనం అడుగకపోయినా పిలిచి ఇస్తారన్నారని, అందుకు తానే నిదర్శనమన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేసీఆర్ మనిషని గతంలోనే చెప్పానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 30వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలను, విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, పవన్, అక్బర్, సంతోష్, యశ్వంత్, లడ్డూ యాదవ్ పాల్గొన్నారు.

భారీగా పట్టుబడిన నగదు


ఖిల్లాఘనపురంలో పట్టుకున్న నగదుతో పోలీసులు


రంగారెడ్డిగూడ వద్ద పట్టుబడ్డ నగదుతో పోలీసులు

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోలీస్ గస్తీలో శనివారం భారీగా నగదు పట్టుబడినట్లు ఎస్పీ రక్షితా కె. మూర్తి వెల్లడించారు. వనపర్తి టౌన్ పీఎస్ పరిధిలో రూ.2.40 లక్షలు, వనపర్తి రూరల్ పీఎస్ పరిధిలో రూ.5.78 లక్షలు, పెబ్బేరు పీఎస్ పరిధిలో రూ.5.18 లక్షలు, శ్రీరంగాపూర్ పీఎస్ పరిధిలో రూ.3.50 లక్షలు, పాన్‌గల్ పీఎస్ పరిధిలో రూ.55 వేలు, ఖిల్లాఘనపురం పీఎస్ పరిధిలో రూ.1.09 లక్షలు, గోపాల్‌పేట పీఎస్ పరిధిలో రూ.57,500, మదనాపురం పీఎస్ పరిధిలో రూ.52వేలు, చిన్నంబావి పీఎస్ పరిధిలో రూ.85వేలు, వీపనగండ్ల పీఎస్ పరిధిలో రూ.1.50లక్షలు, ఆత్మకూరు పీఎస్ పరిధిలో రూ.86,900 ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న కారణంగా సీజ్ చేశారు. శనివారం ఒక్క రోజునే వనపర్తి జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.22.64 లక్షల నగదు సీజ్ చేశారు.

మానవపాడు: మండల కేంద్రంలోని చంద్రశేఖర్ నగర్, శ్రీనగర్, కొర్విపాడు స్టేజీ, ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో సరైన ధ్రువపత్రాలు లేని రూ.లక్ష మానవపాడు శివారు ప్రాంతంలో పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులో గల చేగుంట చెక్‌పోస్టు వద్ద శనివారం కర్ణాటక నుంచి వస్తున్న శివప్ప వద్ద రూ.1.20లక్షల నగదు లభించిందని ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపారు. నగదు సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

అయిజ: మండలంలోని మేడికొండ ఎక్స్ రోడ్డు వద్ద ఒక వ్యక్తి నుంచి రూ.69,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ శివారులో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి అనంతపూర్‌కు వెళ్తున్న రోషప్ప, ఆదిసుజాకర్, అఖిల్ వద్ద నుంచి రూ.3,37,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

రిజర్వాయర్ పనులు ఆపాలని ఆందోళన



బల్మూర్: మండలంలోని అనంతవరం, బల్మూర్, మైలారం శివార్లలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్ సర్వే పనులను నిలిపి వేయాలని రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రిజర్వాయర్ నిర్మిస్తే సుమారు 2వేల ఎకరాల సన్నకారు రైతుల భూములు ముంపునకు గురై తమ భవిష్యత్ అంధాకారంగా మారుతుందని వాపోయారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం రెండు రోజులుగా అధికారులు చేపడుతున్న బౌండరి పెగ్ మార్కింగ్ పనులను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పాన్‌గల్: బాలికను వేధించిన ఘటనపై యువకుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించి తీసుకెళ్లాడు. శనివారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, యువకుని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

114 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- బియ్యాన్ని నూకలుగా మార్చి కొత్తరకం దందా
- శాంతినగర్ సీఐ ఆధ్వర్యంలో దాడులు
- 221 బస్తాలు సీజ్


పోలీసుల దాడుల్లోపట్టుబడ్డ రేషన్ బియ్యం బస్తాలు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శాంతినగర్ పోలీసులు సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని కోయిల్‌దిన్నె రోడ్డు సమీపంలోని ఓ గిర్నీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వచేసి వాటిని నూకలుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే సమాచారంతో శాంతినగర్ సీఐ కేఎస్ రత్నం ఆధ్వర్యంలో శనివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. 221 బస్తాల్లో 114 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వాటిలో 117 బస్తాల్లో 62 క్వింటాళ్ల బియ్యం, 104 సంచుల్లో 52 క్వింటాళ్ల నూకలు బయటపడ్డాయి. భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్పీ రితిరాజ్‌కు శాంతినగర్ సీఐ సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాలమేరకు బియ్యాన్ని, గిర్నీని సీజ్‌చేసి తెలుగు భాస్కర్‌పై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

బియ్యాన్ని నూకలుగా మార్చి సొమ్ము

ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యాన్ని తరలిస్తే పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకుంటారనే ఉద్దేశంతో నిందితుడు కొత్త రకం వ్యాపారానికి తెరలేపినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. బియ్యం రవాణా చేస్తే పట్టుకుంటారనే అనుమానంతో తక్కువ ధరకు కొన్న రేషన్ బియ్యాన్ని తన గిర్నీలో నూకలుగా మార్చి అధిక ధరకు మార్కెట్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని, అధికారుల కన్నుగప్పి వ్యాపారం చేస్తూ పట్టుబడ్డాడనే విషయం పట్టణంలో దావాణంలా వ్యాపించడంతో ఎక్కడ చూసినా బియ్యం గురించే చర్చ జరిగింది.

కఠిన చర్యలు

పీడీఎస్ బియ్యం అమ్మినా కొన్నా కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ రితిరాజ్, శాంతినగర్ సీఐ రత్నం హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించామని, పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని రేషన్ బియ్యాన్ని కొనవద్దని వారు పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


సావిత్రమ్మ (ఫైల్)

దామరగిద్ద: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని గడిమున్కన్‌పల్లికి చెందిన సవిత అలియాస్ సావిత్రమ్మ (32)కు నర్సాపూర్‌కు చెందిన భాస్కర్‌తో వివాహం జరిగింది. భాస్కర్ నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తుండగా వీరు మండల కేంద్రంలోని రాంనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. మూడురోజులుగా తన భార్య కనిపించడం లేదని భాస్కర్ అత్తమామలకు తెలియజేశాడు. ఇదిలా ఉండగా శనివారం దామరగిద్దలోని ఎనికెల లక్ష్మప్ప తన ఇంట్లో మహిళ మృతదేహం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వసంత ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సవితగా గుర్తించారు. 25వ తేదీన ఘటన జరిగినట్లు తెలుస్తోందని, మృతురాలి తల్లి కోలుకుంది సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామని ఎస్ఐ వివరించారు.

వేర్వేరుచోట్ల ముగ్గురు దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

ట్రాక్టర్, బైక్ ఢీకొని..

కొత్తకోట రూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ముమ్మళ్లపల్లి వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. హైదరాబాద్‌లోని లాల్‌దర్వాజ, చత్రినాఖాకు చెందిన నల్పురం సాయినాథ్ (23), లక్ష్మీకాంత్ ఇద్దరు స్నేహితులు. కర్ణాటకలోని మురుడేశ్వర్‌కు వెళ్లేందుకు శనివారం బైక్‌పై బయలుదేరారు. ముమ్మళ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను దాటబోయి వెనక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నల్పురం సాయినాథ్‌కు తీవ్ర గాయాలు కాగా.. లక్ష్మీకాంత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. 108లో సాయినాథ్‌ను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. స్నేహితుడు లక్ష్మీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు..

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతిచెందాడు. గ్రామానికి చెందిన రఘుపతిరెడ్డి ఉదయం ట్రాక్టర్‌తో పొలానికి వెళ్తుండగా బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి పడిపోయింది. ఇంజిన్ కింద పడిన రఘుపతిని అటువైపు వెళ్తున్న ప్రయాణికులు గమనించి మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రఘుపతికి భార్య సుశీలమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని..

దేవరకద్ర రూరల్: గడ్డి ట్రాక్టర్‌ను వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటనలో ఒక యువకుడు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బొల్లారం (కోయిల్‌సాగర్) గ్రామానికి చెందిన రాజు(18), ప్రవీణ్, శివ కలిసి శనివారం రాత్రి బైక్‌పై దేవరకద్రకు వెళ్తుండగా.. అడవి అజిలాపూర్ సమీపంలోని మఠం దగ్గర నిలిచి ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా.. ప్రవీణ్, శివలకు తీవ్ర గాయాలయ్యాయి. రాజు సొంతూరు చిన్నచింతకుంట మండలంలోని బండ్రవల్లి కాగా.. తల్లిదండ్రులతో కలిసి అమ్మమ్మ ఊరైనా బొల్లారంలో ఉంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.